# మృతకవులకు లేఖలు

## ౧. అల్లసాని పెద్దన

కొల్లూరు ధర్మరాయ కవి, బి. ఏ.

తాతగారూ!

నమస్తే—

మీ పేర ఉత్తరం వ్రాస్తే భారతి మీకందజేస్తుందనే నమ్మకంచేత వ్రాస్తున్నాను. మీకు తీరికవుంటే తప్పకుండా చదువుతారనే నా ఆశయం.

మీరు ఆంధ్రదేశం విడిచి వెళ్లినతర్వాత యెన్ని మార్పులు జరిగే యనుకున్నారు? మీ మనుచరిత్ర ఒక మనిషైనా రాసుకోలేదుకదా! ఆ రణాలకి భేషైన అచ్చుప్రతి ఉపోద్ఘాతంతోకూడా దొరుకుతూంది; పుస్తకం సగం, తప్పొప్పుల తడక మరొక సగం, చదవటానికి ఓపికలేని ధనికులు కొనుక్కోదగినవి. టీకతోకూడా అచ్చువేసేరు కొందరు. మొత్తాన్ని మీనాటికంటె నేడు మీ గ్రంథం సర్వజన సులభం అయిపోయింది. టీక, మొట్టమొదట బ్రౌనుదొరగారు జూలూరి అప్పయ్యపండితులుచేత వ్రాయించేరు. అతనెంత రసజ్ఞుడనుకున్నారు, ఆ దొరగారు? ఆయన చెప్పేరో, లేక అప్పయ్యపండితుల స్వబుద్ధియో, చెప్పలేం కాని, పరిశుభ్రమైన వ్యావహారిక భాషలో తాత్పర్యం సుబోధమయేటట్టుంది ఆటీక. "తురీయాశ్వాసము" అనకుండా "నాలుగో ఆశ్వాసం" అనే వ్రాసేరు. దరిమిలాను వ్రాసిన టీకలలో అమరంనుంచి, యితర సంస్కృత నిఘంటువులనుంచి ప్రయోగాలు కురిపిస్తూ రసపుష్టికి తోడ్పడని పండితవాసననే వెదజల్లేరు భాష్యకారులు. పామరులు మీ గ్రంథం బోధపర్చుకుందికి యీ గ్లేజుకాగితాలమీద అచ్చైన టీకలు యేమీ సహాయభూతంగా లేవు. ఏమైతే నేం? చూడని హిమాలయపర్వతాన్ని జనులెందరు మెచ్చుకోలేదు? మీ గ్రంథాన్నీ అంతే.

ఇక, పరిశోధకాగ్రగణ్యులు మీ మనుచరిత్రగురించి యెంత కొట్టుకున్నారనుకున్నారు! "కుతప" కాలం గురించి కుండలాల పండితుల గ్రుద్దులాట యిప్పటి కింకా ప్రతిధ్వనిస్తూంది. అది అంతా మీ కావ్యంలో (Unity of time) కాల సంయమనం సుష్ఠుపరచటానికి! మానాటిలఘుబుద్ధులకి మీరేం జేస్తారు? ఆ చలువమల మీదకి ప్రవరుడుతో కూడా వెళ్లి వ్రాలిన పిమ్మట, కాలచక్రానికి లొంగుతుందా, మీ సృష్టి? పాదలేపనం యిచ్చినవాడు ప్రపంచాతీతుడైన పరమసిద్ధుడు-బయలుదేరినవాడు గార్హస్థ్యనిత్యకర్మలో గుడుగుడుకుంచము లాడుతూ సృష్టివిలోకనం కోసాన్ని రెక్కలు కట్టుకొన్న ఉత్కంఠగల "తరుణాగ్నిహోత్రి"— స్వప్నసీమవలె పొడసూపినది అంబరచుంబియైన హిమవచ్ఛిఖరి!

అట్టి అమరసన్నివేశము పరిమిత కాలవిభాగ సూచిమైన యామగణనమునకు లొంగదీయుటకై విశ్వప్రయత్నం చేసేరు. ప్రవరుడు తరఫున గంటలవెంబడి డైరీ వ్రాసేరు కొందరు. విశ్వమోహనమైన మీ స్వప్నయాత్రకి రైల్వే గైడ్ మానదండంగా జేసి మట్టిలో గలిపేరు!

మీ కాలికి గండపెండేరం తొడిగిన అపర భోజుడికి ఈ సంశయాలు పొడగట్టలేదూ? లేదనుకుంటాను. ఆ విశ్వసౌందర్య పిపాసువునకు తలదిమ్ము కలిగించే దివ్య మధుపాత్ర ప్రసాదం చేసు మీరు. ప్రవరుడుతోపాటు రాయలు కూడా మీ అద్దాలలో శిశువైపోయేడు! లేకుంటే ఆ ప్రభువుకి మీరంటే యెందుకుంటుంది అంతమోహం? — కానీ — తాతగారూ! నేటి శిథిలమైపోయిన హంపీ సౌభాగ్యం చూస్తే నే మాగుండెలు బరువై ముసలి శౌర్యంతో రక్తం వేడి యెక్కుతుంది కదా, ఆనాడు ఆ రామరాజ్యంలో జీవిస్తూ, పొట్నూరుదాక రాజ్యదండం సాగించిన చక్రవర్తిహస్తం మీ పల్లకీ యెత్తిననాడు,- ఆ అవ్యయానందంతో మీకు గుండెలు విచ్చిపోలేదూ! ఎలాగు బ్రతికున్నారండీ "జీవచ్ఛవం"లాగు, అలాంటి ప్రభువు గతించిన పిమ్మట? వాంఛలన్నీ తీర్చటానికి కంకణం కట్టుగున్న ప్రభువున్నప్పుడు మరి మీకు జీవితంలో మధురిమ యెక్కడిది? అంతటి అవ్యయమైన తృప్తిచేతనే మరొకకావ్యం మీరు వ్రాసి ఉండరు. ఏవేనా వ్రాసినవి ఉన్నప్పటికీ, భద్రగజం మీదికి రాజు చేయూత యివ్వకమునుపే వ్రాసేరని నానమ్మకం. విశ్వకర్త సృష్టి కంతటికీ హిమాలయం మాత్రం ఒక్కటే! దానికి తలమానికం లాగు కావ్యసృష్టిలో ఒక్కటెయే వరూధిని! తాజమహాలు నిర్మించిన శిల్పి తన తనువులోని కళ అంతా ధారపోసిన పిమ్మట మరి జీవించి ఉండడు. తాజమహాలు మాత్రం అతని కర్తికాంత చేతి ముకురం.

తాతగారూ! మీ కావ్యాన్ని lyric అని కొందరు pastoral అని కొందరు అంటున్నారు. కాని అది Epic అని నా అభిప్రాయం. అయోనిజము, అమానుషము, అయిన సన్నివేశమును చిత్రించే కావ్యమేదైనా Epic అనిపించుకుంటుంది. అందలి పాత్రములన్నిటిని దైవికమైన ఒకతేజస్సు ఆవరించి వుంటుంది. ప్రవరుని పరస్త్రీపరాఙ్ముఖత్వము అతనియందలి సామాన్య మానవధర్మాన్ని అపహరించింది. వరూథిని "మరున్నారీ శిరోరత్నము." నేల కాలుబెట్టు మానవజాతికాదు. ఆమె ప్రేమ పిపాసాశాంతికై కావిదోవతిదాల్చిన యీ శ్రోత్రియుణ్ణి అర్థించింది అపరాని సముద్ర తరంగము కదపరాని కారురాతిని కౌగిలించింది. ఆట్టి లోకోత్తర సన్నివేశమునకు తావెక్కడ? మంటికి దూరమై మింటికి చేరువైన శీతశైలంమీద. ఇంతకన్న Epic అనిపించుకుందికి కావలసిన దేమిటి?

ఒక్కొక్కపరి మీరు ఎవరెస్టు శిఖరంమీద కూర్చుని దివ్యలేఖినితో మీ కావ్యం చిత్రించేరేమా అనిపిస్తూవుంటుంది. ఏదండీ మీ సాయంసమయ వర్ణన:— "శ్రేణుల్ గట్టి నభోంతరాళమున బక్షుల్ పక్షులు" — అల్లవిగో

అని ఆ శిఖరంనుండి సూటిగా గంటంతో చూపించి వ్రాసేరనుకుంటాను ఆవాక్యం. "ఉష్ణాంశుపాషాణవ్రాతము కోష్ణమయ్యె"— సూర్యకాంతపురాళ్ల నులివెచ్చదనపు అనుభవం మీకు సమీపమే అయివుంటుంది. "మృగతృష్ణావార్ధు లింకెన్" — రాజపుత్రస్థానపు టిసుక తిన్నెలపై పలచబారుచున్న గాడ్పుపొగలు మీదృష్టి నాకర్షించి వుంటాయి. "జపాశోణంబయ్యె పతంగబింబము"—తన నీరసించిన ప్రచండతతో అస్తంగతుడౌతూన్న సూర్యుడు మీలేఖినిని తనవైపు మరల్చికొన్నాడు. "దిశాస్తోమంబు శోభాదరిద్రాణం బయ్యె" — అంతకన్న మరేముంది? దివాకరు డస్తమించిన పిదప హిమాలయాన్నత్యంకూడా చీకటి కాటుకలో మాయమవుతుంది. అప్పుడు మీ దృష్టి చెంతనున్న మానస సరస్సుమీద వ్రాలివుంటుంది; "సరోజషండములు నిద్రాణంబులయ్యె" నన్నారు. ఇంత వర్ణనలోను మానవమైన ప్రవృత్తి ఎక్కడా కనిపించదు.

ఒక్కొక్కచోట మీరు పద్యాలతో పంచభూతాల్ని యిచ్చచొప్పున త్రిప్పకున్నారనిపిస్తూ వుంటుంది.

"మృగమదసౌరభ విభవ
ద్విగుణీ కృత సారసాంద్ర వీటీగంధ
స్థగితేతర పరిమళమై"

అని మీరు వర్ణించినమారుతం ఆపద్యంలో చరణాలకంతెను బరువెక్కి అలసగమనం పొందినట్లు తోస్తుంది. తరువాత,

"మగువపొలుపు దెలుపునొక్కమారుత
మొలసెన్"

ప్రవరుణ్ణి సోకిన ఆ లేతగాలి, పీవనతో విసిరినట్లు వచ్చింది ఆ నాలుగోచరణంలో. త్రిమాత్రాగణాలు నాలుగోపాదం లోవెయ్యాలని మీకు తోచిందో, లేక ఆ మరుత్కిశోరమే అలాగు ఒగ్గులు తీర్చిందో మీ పద్యానికి!

ఆ ప్రవరుడు వరూథిని ఉన్న కెలనకు చేరబోతూండగానే, మీరు ప్రబంధసీమ విడిచి నాట్యరంగంలో తెర వెనుకకు చేరేరు; లేక మీరే ప్రవరుడై యుంటారు! "చేరబోయి కనిమెన్ విద్యుల్లతా విగ్రహన్"— మీరు సృజించిన వరూథిని మొదటి చూపునకు మీకే మెరపుతీవలాగు మిరుమిట్లు గొలిపింది. "శతపత్రేక్షణ"—అక్కడ, ప్రవరుడిలోనుండి ఆమె నేత్రములలోకి దృష్టి సారించినది మీరే. ప్రవరునిలో యిమిడిన మీ ఆత్మకళ పట్టజాలక వరూథినిలో ప్రవేశించి యుండనోపును; ఆమె మొగము చాటునకు త్రిప్పకుంది. "చంచరీకచికు"రాలు మబ్బు గ్రమ్మినట్లు తోచేయి. వరూథిని తన కట్టెదుట రూపించిన శృంగార పుంజమును ఒక్కసారి కబళించే లాగు గిరుక్కున మరలి చూసింది కాబోలు, ఆమె "చంద్రాస్య" మప్పుడు కవి హృదయానికి వెన్నెల యిచ్చింది; ప్రవరుని కర్కశతేజస్సుముందట మాత్రం అవనతమైంది. "చక్రస్తనిన్ నతనాభిన్ నవలాన్" అంటూ పరిపూర్ణమైన అవలోకనం ప్రాప్తించింది అప్పుడు. కాని యింత వరకూ ఆమె సౌందర్యచ్ఛాయ

స్వప్న సీమలోవలె మిమ్మల్ని మై మరపించింది; ఆమె యేజాతిస్త్రీయో తెలుసుకోవలసిన అవసరం మీకు కలుగలేదు. ఒకానొక మరు న్నారీశిరోరత్నమని హిమవన్నగ పరిసరమే మీ చెవిలో చెప్పివుంటుంది!

మానవుడగు ప్రవరునిపై ప్రథమ దృష్టి పాతముతో మరులుగొన్న మరుత్కాంతను, భావశకలం వలె బయలున పరుగెత్తు ఆడుబిడ్డను, వ్యోమమునుండి ఎంత మనోహరంగా అవ్యక్తంగా కరకు నేలకు దింపేరు? పాదము నేలకు "చూచి"నంతనే మెట్టింది. అమరత్వం నిరసించి రెక్కలు ముడుచుకుని నేల్వ్రాలింది. లేకుంటే కటకముల ఝుళం ఝుళధ్వని యెట్లా వినిపిస్తుంది? ఆనిస్వనంలో ఆమెహృదయమందలి తత్తరపాటుకూడా ప్రతిధ్వనించింది. దరినెవ్వరూ చెలులు లేరు; సిగ్గు నటించడానికైనా ఆలంబన మేమీ లేదన్నమాట! శ్రోత్రియహృదయంవలె మృత్యుశైత్యం వహించిన ఆమంచు బండలపై "ఎంతలేసి కన్నులున్న" అని మిషాంగనకైనను అట్టిపరిస్థితులలో తెరువేదీ! రాయలవారికైనా తగిన సలహా చెప్పే శక్తి వుండునా? అతడు రాజేకాని మంత్రి కాడే? కవితా పితామహా, "పూచినయొక్క పోకనును బోదియ" నక్కడ సృష్టించిన మీ రసజ్ఞతకు ఆంధ్రలోకంకాదు, సర్వకళా ప్రపంచం మీకు దాసోహమన్నాడి! "పోక" చెట్టుట; అబ్బే, చెట్టూ కాదూ-నునుబోదియ! బలే, యేమిప్రతిసీర! ఎంత నిగూఢచ్ఛాయ! అందులో పుష్పవతి; సెబాసు, తాతగారూ! సాకుమార్యములో ఎంత భావగాంభీర్యం? రాయలు తన సర్వస్వ మిచ్చివేసి యడవులు పట్టిపోయినను, ఆపద్య మొక్కటిమాత్రం జపిస్తూ సంతుష్టుడై యుండునేమో?—

తాతగారూ! ఇంతెకూ, మీ జీవితకాలంలో మీరుపొందిన సన్మానానికి కారణం గ్రహించడమే మా నాటి వారి అభీష్టం. ఇట్టి మనోహర దృశాలు ప్రదర్శించిన మీ కళా చాతురికి మానమస్సుతప్ప వేరేమి కాన్కనీయగలము?

ఒక్కవిషయం విన్నవించి ముగిస్తున్నాను. మీ వరూథినికి వన్నె పెట్టిన వారు నేడొకరున్నారు.

"——శీతా చలోన్నత
శృంగవీథులపై వరూథిని
నగ్నతకు నొకమంచు తెలివసనంబు" కట్టినా డతడు. తనహృదయ సర్వస్వమును దోపిట నందిచ్చిన వరూథినిని "అంసద్వయమంటి" ప్రవరుడు త్రోసినాడు. "కలంచునే సతులమాయల్ ధీరచిత్తంబులన్" అనిఅతడికి compliment ఇచ్చేరు మీరు! కాని వరూథిని యేమి మాయలాడితనం ప్రదర్శించింది? ఆమె ప్రేమతో తన సర్వస్వం పరిత్యజించిందే. "అనిమేష స్థితి, అస్వేదతా వృత్తి, బోధకళ" త్యజించి "బిత్తరపుచూపు, నవస్వేదసమృద్ధి, మోహవిభ్రాంతి"—సామాన్యమానుషత్వం అభిలషించిందే! ఒడిలో విగతజీవుడగు నాథుని పెట్టుకొని క్లియోపాట్రా రోదసీకుహరము

బ్రద్దలగునట్లు పలికిన పలుకేమిటి? "No more an empress, but a mere woman!" కాని సర్వము సమాప్తమై, ప్రణయానుబంధము కడపటిసారి బిగిసిపోవునపుడు, ఆ చక్రవర్తినియందు శ్రీరక్తము ఉడుకెత్తి, ఆమెకొక Epic grandeur ఆవేశించింది :—

"Give me my robe, put on my crown; I have
Immortal longings in me ............
I am fire and air; my other elements
I give to baser life."

శిరస్కృతమైన వరూథిని మనఃప్రవృత్తి యింతకు కోటిరెట్లు కల్లోలమై ఉంటుంది. అదియే మా దీక్షితులుగారు ప్రదర్శించినది. ఆయువ వరూథిని యేం చేసిం దనుకున్నారు? మీ వరూథిని లాగు మాయాప్రవరుడు చేతుల్లో చిక్కిపోయి, మృషానురక్తికి మోసగిల్లలేదు. వీణాతంత్రులు తెగునట్లు ఘల్లున మ్రోగించి "మానవు లెంత కఠినహృదయులు" అని పాలబాటలో మార్మోగున ట్లాక్రోశించింది. ఆ వాక్యముతో ఆమె మరుత్తత్వము పునరుజ్జీవించింది. హృదయము మాత్రం వీణాతంత్రులతోపాటు భగ్నమైపోయింది. గీర్వాణ వధూటి గిరవాటువైచిన శిథిలహృదయమే మా దీక్షితులుగారు ఆంధ్రలోకమునకు ప్రసాదించేరు. * * * *

నేటికాలంలో మీరు జీవించివుంటే, మను చరిత్ర అట్లాగే వ్రాతురని నానమ్మకం. కాని కావ్యనామంలోని మీ ఉద్దిష్టార్థం వ్యంగ్యమవుతుంది. స్వారోచిషమనుసంభవం అసంభవమవుతుంది. * * *

తాతగారూ! ఇంతకూ మీ త్రొక్కిన మార్గం మాకు ఉపాదేయం. అందుచేతనే వ్రాసిన విషయం ఇంత దవ్వు పెరిగింది.

చిత్తగించండి— నమస్కారం—

..............—

---

# మా వ్యాసకర్తలకు

వ్యాసములు చిన్న సైజు కాగితములపై ఒకవైపున మాత్రమే విడిఅక్షరములతో బంతులు దూరదూరముగా, దిద్దుబాట్లు లేకుండ, తిన్నగా వ్రాసి వర్ణక్రమమునను తప్పులు లేకుండ చూచుకొని పంప వేడికోలు. లేకున్న ముద్రణకార్యములయందు మిగుల కష్టము కలుగుటయే కాక తప్పులుకూడ నిలిచిపోవునని మనవి.

సంపాదకుడు, 'భారతి'.